7

సాక్షి
మహబూబ్‌నగర్
గురువారం । 12 । సెప్టెంబర్ । 2024

గరిష్ఠం/కనిష్ఠం
33.6 /21.1

వాతావరణం
ఆకాశం అప్పుడప్పుడు మేఘావృతమై ఉంటుంది. ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

వెళ్లిరా.. వినాయకా..



గణేశ్ ఉత్సవాలలో భాగంగా ఐదో రోజు భక్తులు అధికసంఖ్యలో గణనాథులను శోభాయాత్రగా తరలించి బుధవారం బీచుపల్లి వద్ద కృష్ణానదిలో నిమజ్జనం చేశారు. గజ ఈతగాళ్ల, అధికారుల పర్యవేక్షణలో క్రేన్ సహాయంతో బొజ్జ గణపయ్యలను కృష్ణమ్మ ఒడికి చేర్చారు. - ఎర్రవల్లి

న్యూస్‌రీల్

రేపు జిల్లాస్థాయి అథ్లెటిక్స్ ఎంపికలు

మహబూబ్‌నగర్ క్రీడలు: హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీలో ఈ నెల 19, 20 తేదీల్లో జరగనున్న 10వ అంతర్ జిల్లా రాష్ట్ర స్థాయి (అండర్–14, అండర్–16, అండర్–18, అండర్–20) అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొనే జిల్లా బాలబాలికల ఎంపికలను శుక్రవారం జిల్లాకేంద్రంలోని మెయిన్ స్టేడియంలో నిర్వహిస్తున్నట్లు జిల్లా అథ్లెటిక్స్ సంఘం ప్రధాన కార్యదర్శి జి.శరత్‌చంద్ర బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు ఎంపికలు ప్రారంభమవుతాయని, ఆసక్తి గల క్రీడాకారులు తమ కుల, జనన ధ్రువపత్రం, ఎస్ఎస్‌సీ మెమోతో కోచ్‌లు ఆనంద్, సునీల్‌లకు రిపోర్టు చేయాలని పేర్కొన్నారు. వివరాల కోసం 9492177535, 9440656162 నంబర్లను సంప్రదించాలని కోరారు.

వదంతులు నమ్మొద్దు..

మహబూబ్‌నగర్ న్యూటౌన్: జిల్లా రిజిస్ట్రేషన్ కార్యాలయం మార్పుపై వస్తున్న వదంతులను నమ్మొద్దని జిల్లా రిజిస్ట్రార్ రవీందర్ తెలిపారు. ట్యాంక్‌బండ్ సమీపంలోని ఓ భవనాన్ని ఈ నెల 10న పరిశీలించి నివేదిక పంపించినట్లు చెప్పారు. అంతలోనే జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం మార్పుపై ప్రచారం జరిగిందని, కమిషనర్ ఆదేశాల మేరకు మరో ఏడాది వరకు మార్పు ఉండదని స్పష్టం చేశారు.

ఎస్సీ వర్గీకరణ తీర్పును పునఃపరిశీలించాలి



మహబూబ్‌నగర్ రూరల్: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును పునఃపరిశీలించాలని మాలల చైతన్య సమితి రాష్ట్ర అధ్యక్షుడు మూలే కేశవులు కోరారు. ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద బీఎస్పీ అధినేత్రి, యూపీ మాజీ సీఎం మాయావతి, అఖిలేష్ యాదవ్, కేంద్ర మంత్రి పాశ్వాన్ సభకు మద్దతుగా బుధవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రాలలో ఎస్సీ వర్గీకరణ చేసుకోవచ్చని ఇచ్చిన తీర్పు 341 ఆర్టికల్‌కు విరుద్ధమని అన్నారు. అనంతరం కలెక్టరేట్ ఏఓ శంకర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు కానుగడ్డ యాదయ్య, చెన్నకేశవులు, కంచిమి లక్ష్మణ్, శ్రీనివాసులు, చెన్నయ్య, వెంకట్రాములు, శివకుమార్, యాదయ్య పాల్గొన్నారు.

ఈ కుబేర్ విధానం రద్దు చేయండి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): ఈ కుబేర్ విధానాన్ని రద్దుచేసి, ఉద్యోగులకు రావాల్సిన బిల్లులను వెంటనే మంజూరు చేయాలని టీఎన్‌జీఓ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాజీవ్‌రెడ్డి, చంద్రానాయక్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కుబేర్ విధానం ఉద్యోగులకు శాపంగా మారిందన్నారు. ప్రభుత్వం స్పందించి పాత పద్ధతిని అమలుపర్చాలని కోరారు. ఈ మేరకు కేంద్ర కార్యవర్గ సమావేశంలో తీర్మానించినట్ల పేర్కొన్నారు.

వినియోగదారుల మన్ననలు పొందాలి



జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): వినియోగదారుల మన్ననలు పొందేలా వ్యాపారాలు చేయాలని డీఎస్పీ వెంకటేశ్వర్లు సూచించారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఓ హోటల్‌లో హాల్ మార్క్‌పై బంగారు వ్యాపారస్తులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. ప్రభుత్వ నిబంధనల ప్రకారం నాణ్యమైన బంగారాన్ని వినియోగదారులకు విక్రయించాలని సూచించారు. మోసంతో వ్యాపారం చేయకూడదన్నారు. అమాయక ప్రజలను మోసంచేసే వారిపై పోలీసు శాఖ కఠినంగా వ్యవహరిస్తుందని హెచ్చరించారు. అనంతరం బులియన్ మర్చంట్ అసోసియేషన్ అధ్యక్షుడు గోవర్ధన్ మాట్లాడుతూ.. ఇకపై ప్రభుత్వం ఆమోదించిన హాల్ మార్కుతో హెచ్‌యూఐడీ కలిగిన బంగారం ఆభరణాలను అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో రూరల్ సీఐ గాంధీనాయక్, హెచ్‌యూఐడీ సభ్యులు శ్రీకాంత్, ప్రశాంతి, అసోసియేషన్ కార్యదర్శి మజీద్, కోశాధికారి రాంగోపాల్ చారి, సహాయ కార్యదర్శి నజీర్, రహమాన్ పాల్గొన్నారు.

శ్రీశైలం గేట్లు మూసివేత
పాత ఉల్లికి డిమాండ్
- వివరాలు 8లో..

పంట మొత్తం నీటిలోనే..





కౌకుంట్ల గ్రామానికి చెందిన రాసాల నర్సిములు.. ఆరు ఎకరాలలో పత్తి పంటను సాగు చేశాడు. ఇటీవల కురిసిన వర్షాలకు మూడు ఎకరాల పత్తి పంట మొత్తం నీట మునిగింది. వర్షం ప్రభావం తగ్గినప్పటికీ నీరు వెళ్లేందుకు మార్గం లేకపోవడంతో పొలంలో నీరు మోకాళ్ల లోతులో నిలిచింది. పంట నీటిలోనే మునిగి ఉండటంతో తెగుళ్లు సోకాయి. కనీస పెట్టుబడులు కూడా **అందే పరిస్థితి లేదని ఆ రైతు ఆవేదన వ్యక్తం చేశారు.**

రూ.2 లక్షల నష్టం





కౌకుంట్లకు చెందిన గొల్ల కతలయ్య యాదవ్, తనకున్న పొలంతో పాటు మరో 12 ఎకరాలను కౌలుకు తీసుకొని పత్తిని సాగు చేశారు. వర్షాలకు మూడు ఎకరాల పత్తి పంట మొత్తం నీట మునిగి వైరస్ సోకింది. దాదాపు రూ.2 లక్షల వరకు నష్టం వాటిల్లిందని వాపోయారు. ప్రభుత్వం, అధికారులు స్పందించి **నష్టపోయిన మాలాంటి రైతులను ఆదుకోవాలని కోరారు.**

‘తెల్ల’బోతున్నారు..!



జాంపల్లి శివారులో పాడైన పత్తి పంట

సాక్షి ఫోకస్

పత్తి పంటకు తెగుళ్లు
- భారీ వర్షాలతో చేలల్లో నిలిచిన నీరు
- తేమ ప్రభావంతో సోకుతున్న వైరస్
- కుళ్లిపోతున్న మొక్కల మొదళ్లు.. మాడిపోతున్న ఆకులు
- నిలవని పూత.. రాలిపోతున్న కాయలు
- ఉమ్మడి జిల్లాలో 27 వేల ఎకరాల్లో ప్రభావం
- దిగుబడిపై రైతుల్లో ఆందోళన

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: ఇటీవల కురిసిన భారీ వర్షాలు తెల్లబంగారం పండిస్తున్న రైతులను కునుకు లేకుండా చేస్తున్నాయి. పోటెత్తిన వరదతో చేలల్లో నీరు నిల్వ ఉండడం.. వాతావరణంలో మార్పులు, తేమ శాతం పెరగడం పత్తి పంటపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. గుమ్మడి, ఆకుమచ్చ, కాయకుళ్లు, ఎండు, ఎర్ర తెగుళ్ల బారిన పడగా.. మొక్కల మొదళ్లు కుళ్లిపోతున్నాయి. ఆకులు మాడిపోయి పసుపు, ఎరుపు రంగులోకి మారుతున్నాయి. నిలవని పూత.. రాలిపోతున్న కాయలను చూసి రైతులకు కన్నీళ్లే దిక్కవుతున్నాయి.

పూత, కాత దశలో..

ఉమ్మడి పాలమూరులో ఈ వానాకాలం సీజన్‌లో 5,08,148 ఎకరాల్లో పత్తి సాగు చేశారు. మే చివరి వారం నుంచే రైతులు విత్తనాలు పెట్టారు. అయితే సీజన్ మొదట్లో తగిన వర్షాలు లేక మొక్కలు ఎదగలేదు. జూలై నుంచి వర్షాలు కురవడంతో మొక్కలు ఏపుగా పెరిగాయి. పూత విరగ కాసిన క్రమంలో నాలుగైదు రోజులు భారీ వర్షాలు ముంచెత్తడం.. పంట వైరస్‌ల బారిన పడడంతో పూతతో పాటు పిందెలు, కాయలు రాలిపోతున్నాయి. మరో నెలన్నర రోజుల్లో పత్తి చేతికొస్తుందని ఎన్నో ఆశలతో ఎదురుచూస్తున్న రైతులు ప్రస్తుతం నెలకొన్న విపత్కర పరిస్థితులను చూసి గుండెలు బాదుకుంటున్నారు.

సుమారు 27 వేల ఎకరాల్లో నష్టం

గతేడాది ఖరీఫ్ సీజన్ మొదట్లో వరుణుడు దోబూచులాడిన విషయం తెలిసిందే. పత్తి చేన్లు సరిగ్గా ఎదగకపోవడంతో దిగుబడి అమాంతంగా తగ్గింది. ఎకరాకు సుమారు 10 నుంచి 12 క్వింటాళ్లు రావాల్సి ఉండగా.. ఆరు క్వింటాళ్లకు మించి దిగుబడి రాలేదు. దీంతో రైతులకు పెట్టుబడి ఖర్చులు వెళ్లలేదు. ఈ సారైనా కలిసి వస్తుందనే ఆశతో పత్తి సాగు చేసిన వారికి భారీ వర్షాలు, తెగుళ్లు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. భారీ వర్షాలతో ఉమ్మడి జిల్లాలో 14,497 ఎకరాల్లో పత్తి పంట దెబ్బతినగా.. మొత్తం 26,900 ఎకరాల్లో పంట వైరస్ బారిన పడినట్లు వ్యవసాయాధికారులు అంచనా వేశారు. ఈ మేరకు తగిన జాగ్రత్త చర్యలు చేపడితే నష్టాన్ని తగ్గించవచ్చని వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు.

జిల్లాల వారీగా పత్తి పంట నష్టం ఇలా.. (ఎకరాలలో)

జిల్లా	సాగైంది	వర్షాలతో నష్టం	వైరస్ బారిన పడింది
మహబూబ్‌నగర్	85,528	642	7,000
నాగర్‌కర్నూల్	1,20,175	575	300
జోగుళాంబ గద్వాల	1,25,000	12,000	12,500
నారాయణపేట	1,65,150	600	1,000
వనపర్తి	12,295	680	6,100

చేలల్లో నీరు నిల్వకుండా చూడాలి..



చేలల్లో నీరు నిల్వ ఉంటే మొక్కలు చనిపోతాయి. ఈ మేరకు నీరు నిల్వకుండా చూడాలి. ఎకరాకు 25 కిలోల యూరియా, 20 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ రసాయనిక ఎరువులను పైపాటుగా పంటకు మొక్కల మొదళ్లలో 7–10 సెం.మీల దూరంలో పాదులు తీసి వేయాలి. దానిపై మట్టిని కప్పాలి. ముంపునకు గురైన పంట త్వరగా కోలుకోవడానికి 19:19:19 లేదా 13–0–45 లేదా 10 గ్రాముల యూరియా లీటరు నీటికి కలిపి వారం రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేయాలి. పిండి నల్లి రావడానికి అవకాశం ఎక్కువ, ఎసిఫేట్ 1.5 గ్రాములు లేదా రెండు మిల్లీలీటర్ల ఫిప్రోనిల్ మందును లీటర్ నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి. నేల ద్వారా వ్యాప్తి చెందే ఎండు తెగులు నివారణకు 3 గ్రాముల కాపర్ ఆక్సీక్లోరైడ్ లేదా ఆల్టర్నేరియా.. ఆకుమచ్చ తెగులు నివారణకు 2.5 గ్రాముల కార్బెండజిమ్, మ్యాంకోజెబ్ శిలీంద్ర నాశక మందును లీటరు నీటికి కలిపి నేల బాగా తడి చేటట్టు వారం వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేయాలి. - వెంకటేష్, జిల్లా వ్యవసాయాధికారి, మహబూబ్‌నగర్

ఎర్రతెమ్మ తెగులు సోకింది..



మాకు 12 ఎకరాల పొలం ఉంది. ఆరు ఎకరాల్లో వరి సాగు చేశాను. మూడెకరాల్లో వేరుశనగ, మూడు ఎకరాల్లో పత్తి పంటసాగు చేశాను. పత్తి అర ఎకరా వరకు నీరు నిలవడం ఎర్రతెమ్మ తెగులు సోకింది. దీంతో దాదాపు 25 వేల రూపాయల నష్టం వచ్చింది. మా పక్క పొలంలో దాదాపు ఎకరా పంటకు ఎర్రతెమ్మ తెగులు తాకింది. - శేషయ్య, కేశంపేట, రేవల్లి మండలం (వనపర్తి జిల్లా)



ధరూర్ మండలంలో ర్యాలంపాడులో కుళ్లిపోయిన పత్తికాయలను చూపుతున్న రైతు

అమరుల త్యాగం మరువలేనిది: కలెక్టర్

మహబూబ్‌నగర్ క్రైం: అటవీ సంపద పరిరక్షణలో అమరులైన అధికారులు, సిబ్బంది త్యాగం మరువలేదని కలెక్టర్ విజయేందిర బోయి అన్నారు. అటవీశాఖ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డితో కలిసి జిల్లా అటవీశాఖ కార్యాలయ ఆవరణలో అమరుల స్థూపానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. అటవీ సంపద అక్రమ రవాణాను అడ్డుకునే క్రమంలో రాష్ట్రవ్యాప్తంగా 23 మంది అధికారులు, సిబ్బంది అమరులయ్యారని గుర్తు చేశారు. వారి త్యాగం ఎప్పటికీ మరువలేనిదన్నారు. అడవుల సంరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. పాలమూరు జిల్లాలో అటవీ విస్తీర్ణం తక్కువగా ఉందని, విరివిగా మొక్కలు నాటి పెంచాలని సూచించారు. అనంతరం ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. అటవీ సంపదను కాపాడుకోవాల్సిన బాధ్యత మన అందరిపై ఉందన్నారు. అడవులను నమ్ముకొని జీవనం సాగిస్తున్న చెంచులు, లంబాడ, ఇతరుల జీవనోపాధికి ఎటువంటి భంగం కలగకుండా చూడాలన్నారు. రాష్ట్రంలో చెరువులు, కుంటలను ఆక్రమించి నిర్మాణాలు చేపట్టిన వారిపై చర్యలు తీసుకోవడంతో పాటు అక్రమ కట్టడాలను కూల్చివేస్తున్నట్లు చెప్పారు. అలాగే అటవీ సంపదను కాపాడుకునే విషయంలో ఎవరైనా అడ్డు వస్తే సహించేది లేదని హెచ్చరించారు. డీఎఫ్ఓ సత్యనారాయణ మాట్లాడుతూ.. అటవీ సంపద పరిరక్షణకు అటవీశాఖ సిబ్బంది ఎంతో కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. ఇదే స్ఫూర్తితో విధులు నిర్వహిస్తూ, అడవుల రక్షణకు కృషి చేస్తామన్నారు. అనంతరం రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన రక్తదాన శిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యాలయ ఆవరణలో కలెక్టర్, ఎమ్మెల్యే మొక్కలు నాటారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ రాములు, ఎఫ్ఆర్ఓ చంద్రయ్య, రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.



అటవీశాఖ అమరవీరుల స్థూపానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ విజయేందిర బోయి, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, డీఎఫ్ఓ సత్యనారాయణ, ఇతర అధికారులు

మహిళలకు మెరుగైన అవకాశాలు

- పాలమూరు ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి
- 3 మహిళా శక్తి యూనిట్లతో పాటు పార్కు ప్రారంభం

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: ప్రస్తుతం అన్ని రంగాల్లో మహిళలకు అవకాశాలు మెరుగయ్యాయని పాలమూరు ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఇందిరా మహిళాశక్తి కింద బుధవారం జిల్లా కేంద్రంలోని టీచర్స్‌కాలనీ, వెంకటేశ్వరకాలనీ, లక్ష్మీనగర్‌లలో లేడీస్ టైలర్, మ్యాచింగ్ సెంటర్, బోటిక్యూ, మగ్గం వర్క్ సెంటర్లను, జిల్లా కోర్టు వెనుక భాగంలో ముడా నిధులు రూ.20 లక్షలతో ఏర్పాటుచేసిన పార్కును, మౌలాలీగుట్ట ప్రాంతంలో రూ.25 లక్షలతో విస్తరించిన జంతు జనన నియంత్రణ కేంద్రాన్ని ప్రారంభించారు. అలాగే లక్ష్మీనగర్ కాలనీ శ్మశానవాటిక మొదలుకుని మౌలాలిగుట్టలోని జంతు నియంత్రణ కేంద్రం, ఎఫ్ఎస్‌టీపీల మీదుగా తిమ్మసానిపల్లి వరకు అప్రోచ్ రోడ్డు కోసం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా పాలనలో మహిళలకు పెద్దపీట వేస్తున్నామన్నారు. వివిధ యూనిట్లతో బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని సూచించారు. తమ కాళ్లపై తాము నిలబడి ఇతరులకు ఆదర్శంగా నిలవాలని, మహిళలు వ్యాపారవేత్తలుగా ఎదగాలన్నారు. కాగా, పార్కులో వివిధ రకాల మొక్కలు నాటి నీరు పోశారు. ఆయా కార్యక్రమాల్లో స్థానిక సంస్థల అడిషనల్ కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, మున్సిపల్ చైర్మన్ ఎ.ఆనంద్‌కుమార్‌గౌడ్, వైస్‌చైర్మన్ షబ్బీర్‌అహ్మద్, కౌన్సిలర్లు పుల్లా నీరజ, మోతీలాల్, రోజా, జాజిమొగ్గ నర్సింహులు, ఉమర్‌పాషా, మునీరుద్దీన్, కమిషనర్ డి.మహేశ్వర్‌రెడ్డి, ఏఎస్ఓ సలీం, కాంగ్రెస్ నాయకులు సిరాజ్‌ఖాద్రీ, లక్ష్మణ్‌యాదవ్, బుద్దారం సుధాకర్ రెడ్డి, ఇమ్మడి పురుషోత్తం ఖాజాపాషా, పాపారాయుడు, మల్లు నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

25న జిల్లాస్థాయి సాంస్కృతిక పోటీలు

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లా కేంద్రంలోని మెయిన్ స్టేడియంలో ఈ నెల 25వ తేదీన జిల్లాస్థాయి సాంస్కృతిక పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా యువజన, క్రీడల అధికారి ఎస్.శ్రీనివాస్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. 15–29 ఏళ్లలోపు యువత ఈ పోటీల్లో పాల్గొనవచ్చని పేర్కొన్నారు. నిర్ణీత దరఖాస్తులను ఈనెల 24వ తేదీ లోగా కార్యాలయంలో అందజేయాలని సూచించారు. జానపద నృత్యంలో వ్యక్తిగతంగా, బృందం, జానపద గీతాలు వ్యక్తిగతంగా, బృందంతో పాడవచ్చని తెలిపారు. స్టోరీ రైటింగ్, పోస్టర్ మేకింగ్, ఉపన్యాసం, కవిత్వం, యువక్రిటి అంశాల్లో పోటీలు ఉంటాయని తెలిపారు. జిల్లాస్థాయి పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచిన వారిని రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని ఆయన తెలిపారు.

నిమజ్జనం ఏర్పాట్ల పరిశీలన



హన్వాడ పెద్దచెరువు వద్ద అధికారులతో మాట్లాడుతున్న ఎస్పీ జానకి

హన్వాడ: మండలకేంద్రంలోని పెద్ద చెరువు వద్ద గణపతి నిమజ్జనానికి చేసిన ఏర్పాట్లను ఎస్పీ జానకి పరిశీలించారు. బుధవారం నుంచి జిల్లాలో నిమజ్జన మహోత్సవం ప్రారంభం కావడంతో ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ఆమె తహసీల్దార్ కిష్టయ్యకు పలు సూచనలు చేశారు. ఎస్పీ వెంట డీఎస్పీ వెంకటేశ్వర్లు, సీఐ గాంధీనాయక్, ఎస్ఐ వెంకటేష్, తదితరులున్నారు.

పారిశుద్ధ్యం మెరుగుపడేనా?

- ప్రతి శుక్రవారం డ్రై డే నిర్వహిస్తున్న మున్సిపల్ అధికారులు
- పట్టణంలో ఇటీవల 5 రోజుల పాటు 'స్వచ్ఛదనం.. పచ్చదనం'
- ఎన్ని చర్యలు చేపట్టినా ప్రజల నుంచి అందని సహకారం

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: జిల్లాకేంద్రంలో పారిశుద్ధ్యం అధ్వానంగా మారింది. అసలే వర్షాకాలం.. ఆపై చాలా వీధుల్లో అపరిశుభ్ర వాతావరణం నెలకొంది. ఎక్కడికక్కడ చెత్తాచెదారంతో నిండిపోయాయి. ఓపెన్ ప్లాట్లలో వరద నీరు నిలిచి మురుగు గుంటలుగా మారాయి. జిల్లాకేంద్రంలోని మొత్తం 49 వార్డుల పరిధిలో సుమారు 2.88 లక్షల మంది జనాభా ఉంటుంది. అలాగే 50 వేల పైచిలుకు ఇళ్లు, భవన సముదాయాలు (అసెస్‌మెంట్లు) ఉంటాయి. గత నెలలో ఐదు రోజుల పాటు 'స్వచ్ఛదనం.. పచ్చదనం' పేరిట అన్ని వార్డులలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. అలాగే ప్రతి శుక్రవారం డ్రై డే చేపడుతున్నారు. వార్డు ఆఫీసర్ల ఆధ్వర్యంలో ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ టీచర్లు, మున్సిపల్ సిబ్బంది ఇంటింటికీ తిరుగుతున్నారు. దోమల నివారణకు ఆయా వీధుల్లో ఫాగింగ్ చేస్తున్నారు. అలాగే మురుగు గుంటల్లో ఆయిల్ బాల్స్ వదులుతున్నారు. మరోవైపు వైద్య, ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి ఫీవర్ సర్వేను కొనసాగిస్తున్నారు. వాతావరణ ప్రభావంతో దాదాపు ప్రతి ఇంట్లో ఒకరో, ఇద్దరో జలుబు, దగ్గు, విష జ్వరాలతో బాధపడుతున్నట్టు బయటపడింది.

చెత్త సేకరణకు వాహనాలు వచ్చినా..

వాస్తవానికి తడి, పొడి చెత్త సేకరణకు 45 స్వచ్ఛ ఆటోలు, 6 ప్రైవేట్ వాహనాలు, 4 మున్సిపల్ ట్రాక్టర్లు ఉన్నాయి. ఎప్పటికప్పుడు ఈ వాహనాలన్నీ ఆయా వార్డులలో చెత్త సేకరణకు వెళ్తున్నా కొందరుఇవ్వడం లేదు. ముఖ్యంగా రామయ్యబౌలి, పాతపాలమూరు, దొడ్డలోనిపల్లి, ఏనుగొండలోని ఎస్సీ కాలనీ, లక్ష్మీనగర్‌లోని కొంత భాగం, అరబ్‌గల్లి, వడ్డెరబస్తీ, మర్లులోని శాంతినగర్, శ్రీనివాసకాలనీలోని ఊరగుట్ట, మంగలిగుట్ట, బోయపల్లి శివారులోని హనుమాన్ చెరువుతండా, సద్దలగుండు, అరబ్‌గల్లి, వీరన్నపేట, బండ్లగేరి, కిద్వాయిపేట, కొత్తగంజి, హనుమాన్‌నగర్, టీడీగుట్ట, హనుమాన్‌పురా తదితర ప్రాంతాలకు చెందిన ప్రజలు సుమారు 40 శాతం మంది చెత్తను వీధుల వెంట పడేస్తున్నారు. స్వచ్ఛ ఆటోలకు వేస్తే నెలకు రూ.50 నుంచి రూ.70 చెల్లించాల్సి ఉండడంతో వారెవరూ ముందుకు రావడం లేదు. దీంతో ఎక్కడబడితే అక్కడ పోగయ్యే ఈ చెత్తను మున్సిపల్ ట్రాక్టర్లు, ఇతర వాహనాల ద్వారా డంపింగ్ యార్డుకు తరలిస్తున్నారు. వాస్తవానికి చెత్తను ఆరుబయట, ఓపెన్ ప్లాట్లలో పడేయొద్దని మున్సిపల్ అధికారులు, సిబ్బంది తరచూ వివిధ కార్యక్రమాల ద్వారా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నా పట్టించుకోవడం లేదు.

- పారిశుద్ధ్య చర్యల్లో భాగంగా ఓపెన్ ప్లాట్లను శుభ్రం చేయించి.. ఎక్కడికక్కడ రూ.ఐదు వేల చొప్పున జరిమానా విధిస్తున్నట్లు బోర్డులు ఏర్పాటు చేసినా స్పందన లేదు. ఇటీవల మర్లు, బీకేరెడ్డికాలనీ, భగీరథ కాలనీ, బాయమ్మతోట, సుభాష్‌నగర్, ప్రేమ్‌నగర్, ఎదిర, లక్ష్మీనగర్‌కాలనీ తదితర ప్రాంతాల్లో ఈ బోర్డులను ఏర్పాటు చేశారు.



కుమ్మరివాడి రోడ్డు పక్కన పడేసిన చెత్తచెదారం



బాయమ్మతోటలోని ఓపెన్ ప్లాటును జేసీబీతో బాగు చేసి బోర్డు పాతిన మున్సిపల్ సిబ్బంది

బాధ్యులకు నోటీసులు ఇస్తున్నాం

పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలని అన్ని వార్డుల్లో మా సిబ్బందితో తరచూ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. ముఖ్యంగా ఓపెన్ ప్లాట్లలో జేసీబీతో మున్సిపాలిటీ తరపున శుభ్రం చేయించాం. ప్లాట్ల యజమానులకు ముందుగానే నోటీసులు అందజేశాం. చివరకు రూ.ఐదు వేల చొప్పున జరిమానా చెల్లించాలని ఆదేశాలు సైతం జారీ చేశాం. దీనివల్ల కొందరిలో మార్పు వచ్చింది. వీధుల్లో ఎక్కడబడితే అక్కడ చెత్త వేయొద్దు. వర్షాకాలం కావడంతో దోమల బెడద పొంచి ఉంటుంది. - డి.మహేశ్వర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్, మహబూబ్‌నగర్

క్లుప్తంగా

తండ్రి మందలించాడని విద్యార్థిని ఆత్మహత్య


శ్రీలత(ఫైల్)

గండేడ్/మహమ్మదాబాద్: తండ్రి మందలించాడని పదోతరగతి విద్యార్థిని ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటన మహబూబ్‌నగర్ జిల్లా మహమ్మదాబాద్ మండల పరిధిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే దేశాయిపల్లికి చెందిన దొంగల కృష్ణయ్య కూతురు శ్రీలత(14) నంచర్ల ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతోంది. ఈ నెల 9వ తేదీన తన పుట్టినరోజు ఉండడంతో తన తల్లి వద్ద రూ.200 తీసుకొని పాఠశాలలో విద్యార్థులకు చాకెట్లు పంచింది. ఈ విషయం తండ్రికి తెలియడంతో చాకెట్లు పంచడానికి డబ్బులు ఎక్కడివి అని తండ్రి కృష్ణయ్య మందలించాడు. దీంతో మనస్తాపానికి గురైన శ్రీలత సోమవారం రాత్రి ఇంట్లో ఉన్న ఎలుకల మందు తాగింది. కిందపడి వాంతులు చేసుకుంటుండగా గమనించిన తల్లి చంద్రకళ.. ఏమైందని అడగగా తాను ఎలుకల మందు తాగినట్లు తెలిపింది. దీంతో వెంటనే ఆమెను మహబూబ్‌నగర్ జనరల్ ఆస్పత్రికి తీసుకొచ్చారు. అక్కడే చికిత్స పొందుతూ బుధవారం ఉదయం 9.30 గంటలకు మృతి చెందింది. తల్లి చంద్రకళ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శేఖర్‌రెడ్డి తెలిపారు.

ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య

నాగర్‌కర్నూల్ (బిజినేపల్లి): ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన బుధవారం మధ్యాహ్నం మండలంలోని కారుకొండ తండాలో చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. కారుకొండ తండాకు చెందిన అంగోత్ శంకర్ (35) భార్య సంవత్సరం క్రితం పుట్టింటికి వెళ్లి, తిరిగి రాలేదు. దీంతో శంకర్ కొద్ది రోజులుగా మనస్థాపానికి గురయ్యాడు. మంగళవారం రాత్రి ఇంట్లోకి వెళ్లి పడుకున్న శంకర్ బుధవారం మధ్యాహ్నం వరకు కూడా బయటికి రాలేదు. దీంతో అనుమానం వచ్చి స్థానికులు ఇంటి తలుపులు తెరిచి చూశారు. శంకర్ ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించాడు. భార్య రాకపోవడంతో మనస్థాపం చెంది ఆత్మహత్యకు పాల్పడినట్లు స్థానికులు పేర్కొన్నారు.

అనుమానాస్పదంగా చెంచు మహిళ మృతి

కొల్లాపూర్ రూరల్: మండలంలోని మొలచింతపల్లి గ్రామ సమీపంలోని చెంచుగూడెంకు చెందిన చెంచు మెరుపల లక్ష్మి(35) అనుమానాస్పదంగా అడవిలో కుంటలో పడి మృతిచెందింది. గ్రామస్తులు తెలియజేసిన వివరాలు ఇలా ఉన్నాయి. మంగళవారం ఉదయం భర్త శంకర్‌తో కలిసి అడవిలో కట్టెలు కొట్టడానికి లక్ష్మి వెళ్లింది. వారితో పాటు గూడెనికి చెందిన రెండు కుటుంబాలకు చెందిన భార్యాభర్తలు కూడా వెళ్లారు. అదేరోజు రాత్రి 9 గంటలకు భర్త శంకర్ భార్యతో గొడవపడి చేయిచేసుకున్నాడు. ఆ సమయంలో భార్యాభర్తలు తాగి ఉన్నారు. భర్త చేయిచేసుకోవడంతో ఆమె అక్కడి నుంచి పారిపోయింది. ఎంత వెతికినా ఆచూకి లభించలేదు. బుధవారం ఉదయం సమీపంలోని నీటి కుంటలో శవమై తేలింది. ఈ సంఘటపై పోలీసులకు సమాచారం ఇవ్వడంతో మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కొల్లాపూర్‌కు తరలించారు. మృతురాలుకు ముగ్గురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

మరికల్: కన్మనూర్ శివారులోని తోటలో నిల్వ చేసిన రేషన్‌బియ్యాన్ని బుధవారం పోలీసులు దాడులు నిర్వహించి పట్టుకున్నారు. మరికల్‌కు చెందిన ఇంద్రజ మండలంలోని వివిధ గ్రామాల్లో సేకరించిన రేషన్ బియ్యాన్ని కన్మనూర్ శివారులోని తోటలో నిల్వ చేసింది. గ్రామస్తుల ఫిర్యాదు మేరకు పోలీసులు, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు కలిసి దాడులు నిర్వహించారు. దాడిలో 17.80 క్వింటాళ్ల బియ్యం పట్టుబడ్డాయి. కేసు నమోదు చేసి బియ్యాన్ని నారాయణపేట స్టాక్ పాయింట్‌కు తరలించినట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి కాళప్ప తెలిపారు.

కుక్కల దాడిలో గొర్రె పిల్లలు మృత్యువాత



అచ్చంపేట రూరల్: మండలంలోని సింగారం గ్రామంలో బుధవారం వీధికుక్కల దాడిలో 10 గొర్రె పిల్లలు మృత్యువాత పడ్డాయి. గ్రామానికి చెందిన బూరం రాములు ఇంటి వద్ద ఉన్న గొర్రె పిల్లలపై ఒక్కసారిగా కుక్కలు దాడి చేశాయి. కొన్ని రోజుల క్రితం కూడా అంతయ్యకు చెందిన ఏడు గొర్రెల పిల్లలపై కుక్కలు దాడి చేసి చంపేశాయి. వీధి కుక్కల బెడదను తొలగించాలని రైతులు కోరుతున్నారు.

అమ్మా.. నేనేం పాపం చేశాను?

- పసిబిడ్డను ముళ్లపొదల్లో వదిలేసిన తల్లి



అమ్మా.. నేనేం పాపం చేశాను.. ఆడపిల్లనని చిన్నచూపా.. లేక అప్పుడే భారంగా మారానా.. నన్ను ఇలా ముళ్లపొదల్లో వదిలేసి వెళ్లావు.. కనీసం నేను ఎవరినో కూడా నాకు తెలియదు. కొత్తగా ఉన్న ఈ లోకంలో ఎలా మనుగడ సాగించాలి.. నన్ను ఎవరైన దయదలిచి ఆదుకోండని అప్పుడే పుట్టిన ఓ నవజాత శిశువు ఆర్తనాదాలు పలువురిని కలిచివేశాయి. మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర మండలం డోకూర్ స్టేజీ సమీపంలో చోటుచేసుకున్న ఈ ఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. డోకూర్‌కు చెందిన పీఏసీఎస్ చైర్మన్ నరేందర్‌రెడ్డితో పాటు మరికొందరు బుధవారం ఉదయం 6 గంటల సమయంలో వాకింగ్ చేస్తూ స్టేజీ వరకు చేరుకున్నారు. అక్కడ పసిపాప ఏడుపు వినిపించడంతో చుట్టు పక్కల వెతకగా.. ముళ్లపొదల్లో చీమలు పట్టిన స్థితిలో నవజాత శిశువు కనిపించింది. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో, ఘటనా స్థలానికి ఎస్ఐ నాగన్న, అంగన్‌వాడీ టీచర్ విజయలక్ష్మి చేరుకున్నారు. శిశువును వెంటనే దేవరకద్ర పీహెచ్‌సీకి తరలించి చికిత్స చేయించారు. అనంతరం ఐసీడీఎస్ అధికారులకు అప్పగించారు.


పోలీస్‌స్టేషన్‌లో అంగన్‌వాడీ టీచర్ విజయలక్ష్మితో నవజాత శిశువు

- దేవరకద్ర

మాతృత్వాన్ని చాటుకున్న గోవు

- ఆకలితో వచ్చిన పందికి పాలిచ్చిన ఆవు
- సోషల్ మీడియాలో వైరల్


ఆత్మకూర్‌లో ఆవు పాలు తాగుతున్న పంది

అప్పుడప్పుడు జరిగే కొన్ని సంఘటనలు మనల్ని ఎంతో ఆలోచింపజేసే విధంగా ఉంటాయి. ఇలాంటి సంఘటనే వనపర్తి జిల్లాలో చోటు చేసుకుంది. బిడ్డ ఆకలి తల్లికే తెలుసు అన్నట్లు.. ఓ ఆవు తన మాతృత్వాన్ని చాటుకుంది. ఆత్మకూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఓ ఫంక్షన్‌హాల్ సమీపంలో ఓ ఆవు కూర్చొని ఉండగా.. ఆకలితో పాలు తాగేందుకు వచ్చిన పందిని చూసి ఎలాంటి అభ్యంతరం చెప్పలేదు. దీంతో ఆ పంది ఎంచక్కా పాలు తాగి అక్కడి నుంచి వెళ్లిపోయింది. దీనిని కొందరు యువకులు వీడియోలు తీసి సోషల్ మీడియాలో పోస్టు చేయగా వైరల్‌గా మారాయి.

- ఆత్మకూరు (వనపర్తి జిల్లా)

టెండర్ల లొల్లి..


సివిల్ సప్లయ్ డీఎం కార్యాలయం వద్ద ఉద్రిక్తత

- ధాన్యం రవాణా టెండర్ల వద్ద తోపులాట
- కలెక్టరేట్ కార్యాలయం వద్ద ఉద్రిక్తత
- రద్దు చేయాలంటూ ఫిర్యాదు

నాగర్‌కర్నూల్: ధాన్యం రవాణా కోసం కలెక్టరేట్‌లోని సివిల్ సప్లయ్ కార్యాలయం వద్ద బుధవారం నిర్వహించిన టెండర్ల ప్రక్రియ ఉద్రిక్తతకు దారి తీసింది. టెండర్లు తమకే దక్కాలని ఒక వర్గం వారు మరో వర్గాన్ని అడ్డుకోవడంతో కొంత సమయం తోపులాట జరిగింది. జిల్లాలోని నాగర్‌కర్నూల్, అచ్చంపేట, కొల్లాపూర్, కల్వకుర్తి ప్రాంతాల్లోని రైతులు పండించిన వానాకాలం సీజన్ ధాన్యాన్ని ఆయా మిల్లులకు తరలించేందుకు ప్రతి యేటా టెండర్లు పిలుస్తారు. అయితే ఈ టెండర్‌లో పాల్గొనే వారు ఆన్‌లైన్‌తో పాటు ఆఫ్‌లైన్‌లో కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే వారు నేరుగా కార్యాలయానికి వచ్చి దరఖాస్తును టెండర్ బాక్స్‌లో వేయాల్సి ఉంటుంది. ఇంత వరకు బాగానే ఉన్నా.. కల్వకుర్తికి నాలుగు, అచ్చంపేటకు రెండు, కొల్లాపూర్‌కు ఒక టెండరు దాఖలయ్యాయి. నాగర్‌కర్నూల్‌కు సంబంధించిన టెండర్ దాఖలు సమయంలో మాత్రం ఉద్రిక్తత చోటుచేసుకుంది. గతేడాది టెండర్ దక్కించుకున్న నీరజ టెండర్ వేసేందుకు రాగా.. కొంత మంది అడ్డుకున్నారు. దీంతో కార్యాలయం ముందు కొంత సేపు తోపులాట జరిగింది. అక్కడే పోలీసులు ఉన్నా ఫలితం లేకపోయింది. సమయం పూర్తయ్యే వరకు సదరు మహిళను టెండర్ వేయకుండా అడ్డుకునే ప్రయత్నం చేశారు. దీంతో నాగర్‌కర్నూల్‌కు ఒక్క టెండర్ మాత్రమే దాఖలయ్యింది. ఈ విషయంపై సదరు మహిళ టెండర్ సమయం అనంతరం విలేకరులతో మాట్లాడారు. తనను కావాలనే అడ్డుకున్నారని, ఈ విషయంలో అధికారులు కూడా వారికి సహకరించారని పేర్కొంది. ఈ విషయంపై ఎస్పీకి, అదనపు కలెక్టర్‌కు, సివిల్ సప్లయ్ కార్యాలయంలో ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. టెండర్లను రద్దు చేసి మరోమారు టెండర్ల ప్రక్రియ నిర్వహించాలని ఈ సందర్భంగా ఆమె కోరారు.


టెండరు రద్దు చేయాలని కోరుతున్న టెండర్‌దారు నీరజ

ప్రత్యేక జాగ్రత్తలు అవసరం


ప్రిన్సిపాల్ గోవర్ధన్‌తో కలిసి పాఠశాల పరిసరాలను పరిశీలిస్తున్న ఆర్‌సీఓ కల్యాణి

మన్ననూర్: విద్యార్థులపై ప్రత్యేక జాగ్రత్త చర్యలు తీసుకోవాలని గిరిజన గురుకులాల రీజినల్ అధికారి పీఎస్ కళ్యాణి ఉపాధ్యాయులకు సూచించారు. బుధవారం మన్ననూర్‌లోని గిరిజన బాలుర గురుకుల పాఠశాల/కళాశాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల వసతి గృహం పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించిన ఆమె ప్రిన్సిపాల్ గోవర్ధన్, ఉపాధ్యాయులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి పలు సూచనలు చేశారు. వారం రోజులుగా కురిసిన వర్షాలకు దెబ్బ తిన్న భవనాల వద్దకు విద్యార్థులను వెళ్లకుండా చూడాలన్నారు. వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని విద్యార్థులు ఏ చిన్నపాటి అనారోగ్యానికి గురైనా.. ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పాఠశాల నిర్వహణలో ఎలాంటి అవకతవకలు జరిగినా శాఖ పరమైన క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మంత్రులను కలిసిన మార్కెట్ పాలకమండలి సభ్యులు

అలంపూర్: అలంపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీకి కొత్తగా కొలువుదీరనున్న పాలకమండలి సభ్యులు ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనరసింహ, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావును కలిశారు. బుధవారం హైదరాబాద్‌లోని మంత్రుల చాంబర్లలో ఏఐసీసీ కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్ ఆధ్వర్యంలో మార్కెట్ యార్డు కమిటీ చైర్మన్ ఉప్పరి దొడ్డెప్ప, వైస్ చైర్మన్ కొమ్మరి కుమార్, కమిటీ సభ్యులు కలిసి శాలువాతో సత్కరించారు. వ్యవసాయ మార్కెట్ యార్డులో ఈ నెల 13వ తేదిన కొత్త పాలక ప్రమాణ స్వీకారానికి హాజరుకావాలని మంత్రులను ఆహ్వానించినట్లు తెలిపారు. అదేవిదంగా నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవిని కలిసి ఆహ్వానించినట్లు తెలిపారు. వీరితోపాటు ఆర్డీఎస్ ప్రాజెక్టు కమిటి తనల సీతారాం రెడ్డి, జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షుడు నాగరాజు, నాయకులు జగన్ గౌడ్, యోగిరెడ్డి తదితరులు ఉన్నారు.


మంత్రి దామోదర రాజనరసింహను ఆహ్వానిస్తున్న నూతన పాలక మండలి సభ్యులు

హాకీ టర్ఫ్ స్టేడియం ఏర్పాటుకు కృషి


పెబ్బేరులో ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి, ఎమ్మెల్యే మేఘారెడ్డి.

వనపర్తి/వనపర్తి రూరల్: అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో హాకీ టర్ఫ్ స్టేడియం ఏర్పాటుకు కృషి చేస్తానని రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ కె.శివసేనారెడ్డి అన్నారు. బుధవారం కలెక్టర్ ఆదర్శ్ సురభి, ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డిలతో కలిసి టర్ఫ్ స్టేడియం కోసం జిల్లా కేంద్రంలోని బాలుర జూనియర్ కళాశాల మైదానాన్ని పరిశీలించారు. అదేవిధంగా స్పోర్ట్స్ స్కూల్ ఏర్పాటుకు మెడికల్ కాలేజీ సమీపంలోని ప్రభుత్వ స్థలాలను చూశారు. అంతకుముందు కలెక్టరేట్‌లో ప్రభుత్వ భూముల వివరాలను తెలుసుకున్నారు. ఇంటర్ స్థాయి వరకు స్పోర్ట్స్ స్కూల్ ఏర్పాటుకు ప్రభుత్వం నుంచి అన్ని అనుమతులు వచ్చాయని.. పాఠశాలకు కనీసం 25 ఎకరాల స్థలం కేటాయించాల్సి ఉందని తెలిపారు. కాగా, నాచహళ్లి, నాగవరం, అయ్యవారిపల్లి గ్రామాల శివారులోని ప్రభుత్వ స్థలాలను గూగుల్ ఎర్త్ ద్వారా కలెక్టర్ చూపించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్, డీవైఎస్ఓ సుధీర్‌రెడ్డి, పీడీ సురేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

❒ పెబ్బేరులో ఏర్పాటు చేసిన మండలస్థాయి అండర్–14, 17 బాలబాలికల ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీలను ఎమ్మెల్యే మేఘారెడ్డితో కలిసి రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ కరుణశ్రీ, ఎంఈఓ జయరాములు, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్, వైస్ చైర్మన్ కర్రెస్వామి పాల్గొన్నారు.

పాత ఉల్లికి డిమాండ్

- గరిష్ఠంగా రూ. 5100
- కొత్త ఉల్లి ధర రూ. 3660


మార్కెట్‌లో అమ్మకానికి సిద్ధం చేసిన ఉల్లి బస్తాలు

దేవరకద్ర: పట్టణంలోని మార్కెట్ యార్డులో బుధవారం జరిగిన బహిరంగ వేలంలో పాత ఉల్లికి డిమాండ్ ధర పలికింది. సీజన్ లేక పోవడంతో మార్కెట్‌లో ప్రతి బుధవారం ఉల్లి వ్యాపారం మాత్రమే సాగుతోంది.

పోటా పోటీగా వేలం..

దేవరకద్ర మార్కెట్‌కు వచ్చిన పాత, కొత్త ఉల్లికి వేలం పాటలు పోటా పోటీగా సాగాయి. వేలంలో పాత ఉల్లికి ఏకంగా రూ. 5100 గరిష్ఠ ధర పలుకగా కొత్త ఉల్లికి రూ. 3660 గరిష్ఠ ధర వచ్చింది. వేలం తరువాత వ్యాపారులు 45 కేజీల బస్తాలుగా తూకాలు వేశారు. పాత ఉల్లి 45 కేజీల బస్తా ధర రూ. 2550 వరకు విక్రయించగా కొత్త ఉల్లి బస్తా ధర రూ. 1850 వరకు అమ్మకాలు సాగించారు. మార్కెట్‌కు వచ్చిన ఉల్లిని ఎక్కువగా చిరు వ్యాపారులే కొనుగోలు చేశారు. బుధవారం దేవరకద్రలో జరిగిన సంతలో పాత ఉల్లి కేజీ రూ. 60, కొత్త ఉల్లి కేజీ రూ. 40 వరకు విక్రయించారు.

ఆర్‌అండ్‌ఆర్ కాలనీని పునరుద్ధరిస్తాం


కొండచరియలు విరిగిపడిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ సంతోష్

- కలెక్టర్ సంతోష్

నాగర్‌కర్నూల్ (బిజినేపల్లి) : పాలమూర్ రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో వట్టెం రిజర్వాయర్ వద్ద ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో కొండ చరియలు విరిగిపడిన ప్రాంతాన్ని కలెక్టర్ సంతోష్ ఆకస్మికంగా పరిశీలించారు. కాలనీలో నిర్మాణాలను సత్వరమే పునరుద్ధరిస్తామన్నారు. వట్టెం నవోదయ విద్యాలయం సమీపంలో నూతనంగా నిర్మించిన కాలనీలో వర్షాల కారణంగా నష్టపోయిన సీసీ రోడ్లను, విద్యుత్తు సరఫరాను, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు కలెక్టర్‌కు సమస్యలు విన్నవించారు. కొండ చరియ నుంచి భవిష్యత్‌లో మట్టి దిబ్బలు కూలకుండా ఉండేందుకు తగిన చర్యలు తీసుకోవాలని వేడుకున్నారు. గిరిజనుల దేవాలయాలను, ఫంక్షన్ హాల్‌ను కూడా సత్వరమే పూర్తి చేయాలని కోరారు. కొండ చరియలు విరిగిపడటం వలన జరిగిన ఆస్తి నష్టానికి పరిహారం ఇవ్వాలని కోరారు. కలెక్టర్ మాట్లాడుతూ కొండ చరియలు కూలకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని, ఇతర వసతులు సైతం సత్వరమే పునరుద్ధరించాలని అధికారులకు ఆదేశించారు. తహసీల్దార్ శ్రీరాములు తదితరులు ఉన్నారు.

అటవీ సంరక్షణకు పాటుపడాలి


అచ్చంపేటలో అమరవీరుల స్తూపం వద్ద నివాళి అర్పిస్తున్న అటవీశాఖ ఉద్యోగులు

అచ్చంపేట రూరల్: అటవీశాఖ ఉద్యోగులు చెంచులు, అటవీ సమీప గ్రామాల ప్రజలతో సత్సంబంధాలను కొనసాగించాలని డీఎఫ్ఓ రోహిత్‌గోపిడి కోరారు. బుధవారం అచ్చంపేటలో అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ అటవీశాఖ ఉద్యోగుల ఆధ్వర్యంలో జాతీయ అటవీ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని నిర్వహించారు. ప్రధాన రహదారి వెంట ఉద్యోగులు బైక్ ర్యాలీ నిర్వహించారు. అటవీశాఖ కార్యాలయం ఆవరణలో అమరవీరుల స్తూపం వద్ద నివాళి అర్పించారు. అనంతరం మాట్లాడారు. అటవీ సంరక్షణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. అంకితభావంతో పనిచేసినప్పుడే అమరుల ఆత్మకు శాంతి చేకూరుతుందన్నారు. భవిష్యత్ తరాల కోసం మనం విధులు నిర్వర్తిస్తున్నామని, భారంగా కాకుండా బాధ్యతగా పని చేయాలన్నారు. అలాగే ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ కార్యక్రమానికి హాజరై నివాళి అర్పించారు. కార్యక్రమంలో అటవీశాఖ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

జూరాలకు తగ్గిన ఇన్‌ఫ్లో

- 1,12,679 క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల


జూరాల ప్రాజెక్టు వద్ద 11 క్రస్టు గేట్ల ద్వారా దిగువకు విడుదలవుతున్న వరద నీరు

ధరూరు: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి వస్తున్న ఇన్‌ఫ్లో మరింత తగ్గు ముఖం పట్టినట్లు పీజేపీ అధికారులు తెలిపారు. మంగళవారం సాయంత్రానికి 1,35,000 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. బుధవారం సాయంత్రానికి 1,16,00 క్యూసెక్కులకు తగ్గినటుల్ పీజేపీ అధికారులు తెలిపారు. ప్రాజెక్టు 11 గేట్ల ద్వారా 78,441 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు అధికారులు చెప్పారు. విద్యుత్ ఉత్పత్తి నిమిత్తం ప్రాజెక్టు నుంచి 32వేల 993 క్యూసెక్కుల నీటిని వినియోగించుకుంటున్నారు. జూరాల 11 క్రస్టు గేట్ల ద్వారా 78,441 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 70 క్యూసెక్కులు, ఎడమ కాలువకు 735 క్యూసెక్కులు, కుడి కాలువకు 170 క్యూసెక్కులు మొత్తం ప్రాజెక్టు నుంచి మొత్తం 1,12,679 క్యూసెక్కుల నీటిని దిగువన ఉన్న శ్రీశైలం ప్రాజెక్టు వైపు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 9.657 టీఎంసీలు కాగా ప్రస్తుతం ప్రాజెక్టులో 9.152 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఇదిలా ఉండగా.. నారాయణపూర్ ప్రాజెక్టుకు వరద ప్రవాహం స్వల్పంగా కొనసాగుతున్నట్లు అధికారులు తెలిపారు. ప్రాజెక్టుకు 40వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. నారాయణపూర్ ప్రాజెక్టు నుంచి 4 గేట్ల ద్వారా 19,920 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. నారాయణపూర్ ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 37.64 టీఎంసీలు కాగా...ప్రస్తుతం ప్రాజెక్టులో 32.376 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

నిరంతరాయంగా విద్యుదుత్పత్తి

ఆత్మకూర్: ప్రియదర్శిని జూరాల వద్ద కేంద్రాల్లో విద్యుదుత్పత్తి నిరంతరాయంగా కొనసాగుతోంది. బుధవారం 11 యూనిట్లలలో ఉత్పత్తి చేపట్టినట్లు ఎస్‌ఈలు సురేష్, సూరిబాబు తెలిపారు. ఎగువలో 5 యూనిట్లద్వార 195 మెగావాట్లు, 156.177 ఎంయూ, దిగువలో 6 యూనిట్ల ద్వార 240 మెగావాట్లు, 126.384 ఎంయూ విద్యుదుత్పత్తిని చేపట్టామన్నారు. ఎగువ, దిగువ జలవిద్యుత్ ఉత్పత్తి కేంద్రాల్లో ఇప్పటివరకు 282.561 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తిని సాధించామని తెలిపారు.

సుంకేసులలో 7 గేట్ల ద్వారా నీటి విడుదల

రాజోళి: సుంకేసుల డ్యాం నుంచి ఏడు గేట్ల ద్వారా నీటి విడుదల చేస్తున్నట్లు జేఈ రాజు తెలిపారు. బుధవారం ఎగువ నుంచి 33,578 క్యూసెక్కులు ఇన్‌ఫ్లో రాగా.. 31,353 క్యూసెక్కులు గేట్ల ద్వారా, 2,445 క్యూసెక్కులు కేసీ కెనాల్‌కు విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

రామన్‌పాడుకు 400 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో


మదనాపురం: రామన్‌పాడు జలాశయంలో బుధవారం సాయంత్రం నాటికి నీటి మట్టం 1,020 అడుగుల మేర ఉంది. జూరాల ఎడమ కాల్వ ద్వారా 400 క్యూసెక్కుల ఇన్ ఫ్లో ఉంది. సమాంతర కాల్వ ద్వారా వచ్చే నీటిని నిలిపివేశారు. ఎన్‌టీఆర్ కాల్వ ద్వారా 550 క్యూసెక్కులు తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కులు నీటిని వినియోగిస్తున్నామని ఏఈ సింగిరెడ్డి రణీల్‌రెడ్డి తెలిపారు.

శ్రీశైలం ఆనకట్ట గేట్లు మూసివేత

దోమలపెంట: ఎగువ ప్రాంతాలైన జూరాల, సుంకేసుల నుంచి వస్తున్న నీటిప్రవాహం తగ్గుముఖం పట్టడంతో బుధవారం శ్రీశైలం ఆనకట్ట గేట్లు మూసివేశారు. జూరాలలోఆనకట్ట గేట్లు పైకెత్తి స్పిల్‌వే ద్వార 77,825 క్యూసెక్కులు, విద్యుదుత్పత్తి చేస్తూ 32,719, సుంకేసుల నుంచి 31,353 మొత్తం 1,41,897 క్యూసెక్కుల నీటి ప్రవాహం శ్రీశైలం జలాశయం వస్తున్నాయి. శ్రీశైలంలో భూగర్భ విద్యుత్తు కేంద్రంలో విద్యుదుత్పత్తి చేస్తూ 37,116, ఎపి.జెన్‌కో పరిధిలోని కుడిగట్టు కేంద్రంలో ఉత్పత్తి చేస్తూ 31,094 మొత్తం 68,210 క్యూసెక్కుల నీటిని దిగువన సాగర్‌కు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం శ్రీశైలం జలాశయంలో నీటిమట్టం 884.1 అడుగుల వద్ద 210.5133 టిఎంసీల నీటి నిల్వ ఉంది. గత 24 గంటల వ్యవదిలో పోతిరెడ్డిపాడు ద్వార 22,917 క్యూసెక్కులు, మల్యాల, ముచ్చుమర్రి ఎత్తిపోతల నుంచి హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్‌కు 1,688 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. రేగుమాన్ గడ్డ నుంచి ఎంజీకెఎల్ఐకు నీటి విడుదల జరగలేదు. భూగర్భ కేంద్రంలో 16.350 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తి చేశారు. కుడిగట్టు కేంద్రంలో 15.360 మి.యూనిట్లు ఉత్పత్తి చేశారు.

దొంగతనానికి వచ్చి..

- విద్యుదాఘాతంతో తండ్రీ కుమారుడు మృతి
- మిడ్జిల్ మండలం బోయిన్‌పల్లిలో ఘటన


ఘటనా స్థలంలో బాలస్వామి, జయరాజ్ మృతదేహాలు

మిడ్జిల్: రాగివైరు చోరీ చేసేందుకు వెళ్లిన తండ్రీ కొడుకు విద్యుదాఘాతంతో మృతి చెందారు. ఈ ఘటన మిడ్జిల్ మండలం బోయిన్‌పల్లిలోని ప్రగతి సోలార్ ప్లాంట్ వద్ద మంగళవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. ఎస్ఐ శివనాగేశ్వర్ నాయుడు వివరాల మేరకు.. బోయిన్‌పల్లిలోని ప్రగతి సోలార్ ప్లాంట్‌లో తరచూగా రాగివైరు చోరీ అవుతుండటంతో యాజమాన్యం రెండంచెల కంచెను ఏర్పాటు చేసింది. లోపలి భాగంలో ఉన్న కంచెకు విద్యుత్ సరఫరా అయ్యేలా ఏర్పాటు చేశారు. అర్ధరాత్రి సమయంలో రాగి వైరు చోరీ చేసేందుకు వచ్చిన జోగుళాంబ గద్వాల జిల్లా ఇటిక్యాలకు చెందిన బాలస్వామి (42), అతడి కుమారుడు జయరాజ్ (17) మొదటి కంచెను కట్ చేసి సోలార్ ప్లాంట్‌లోకి ప్రవేశించారు. లోపలి భాగంలో ఉన్న విద్యుత్ కంచెను కట్ చేస్తున్న క్రమంలో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతిచెందారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం జడ్చర్ల మార్చురీకి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు. కాగా, సోలార్ ప్లాంట్‌లో విద్యుత్ కంచె ఏర్పాటుకు సంబంధించి అనుమతిపై ఎస్ఐని వివరణ కోరగా.. ప్రైవేటు ప్లాంట్ కావడంతో రక్షణ కోసం కంచె ఏర్పాటు చేసుకున్నారన్నారు. విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు.